# మరచెంబులో మందారపూలు

"బుజ్జీ .. బుజ్జీ" అని పిలిచారు అయన.

"ఏంటండీ! పిలిచారా?" అని వెళ్ళి ఎదురుగా నిలబడ్డాను.

"నిన్నెవరు పిల్చారు! బుజ్జేదీ? అప్పుడే బడికెళ్ళిపోయిందా!"

"నిన్న రాత్రి చెప్పాగదా! నాకూ వాళ్ళమ్మకీ గొడవై పోయిందనీ! ఇంక ఇక్కడుండి నా మాటలు పడలేదుట. వాళ్ళ ఊరు వెళ్ళిపోతారట. అంచేత ఇంకనించి బుజ్జినీ, వాళ్ళమ్మనీ కూడా నేనే. తెల్లారకట్లనించీ నడుం విరిగేలా తుడుచుకొచ్చా - ముత్యమంతా పసుపు పాడుకుంటూ! వినిపించుకుంటే గదా ఏవైనా తెలిసేందుకు?"

"పనివాళ్ళతో పోట్లాడకూడదని చెప్తూనే ఉంటాను. నువ్వు వినిపించు కున్నావు గనకనా!"

"పనివాళ్ళనేం అనకూడదు. పిల్లల్ని అనకూడదు. పెద్దల్ననకూడదు. ఇరుగు పొరుగు ననకూడదు. ఇంక మిమ్మల్ని సరేసరి. మరెవరితో పోట్లా డొచ్చు? అస్తమానం నోరు మూసుకుని ఏం జరిగినా చూస్తూ భరించడం ఇంక నా వల్లకాదు. అయినా పనివాళ్ళతో పోట్లాడ్డం అనరు. కేకలేశాం అనాలి."

"ఏదో ఒకటిలే! అనుభవం వచ్చింది కదా. అయినా నీకూ వాళ్ళమ్మకీ భేదాభిప్రాయాలొస్తే అది వెళ్ళిపోతేగానీ మధ్యలో బుజ్జినెందుకు తీసుకు పోవడం?"

"ఇవే మరి మతిలేని మాటలంటే! తల్లి వెళ్ళిపోతే పిల్ల ఉండిపోతుందా మన కోసం! ఇంక బయల్దేరండి."

"ఏవిటో పాపం! ఎప్పుడూ అంతో ఇంతో పనికొచ్చే వాళ్ళతోటే యుద్ధాలు చేసి అవస్థలు పడుతూ ఉంటుంది" అని సానుభూతి ప్రకటిస్తూ ఆఫీసుకి వెళ్ళి పోయారు ఆయన. నేను నెమ్మదిగా పనిలో పడ్డాను. ఇంతట్లోకి బుజ్జొచ్చింది - వంటింట్లోకి పిల్లిలాగ!

"అమ్మో! నా యమ్మ లెవ్వలేదు. నే చాయి తాగతా!" గట్టు మీద కూచుంది.

"మంచిది."

"వంట నే చెయ్యాల్నా!" అని అడిగింది.

నా పనిలో నేనుండి చూడనే లేదు. వెనక్కి తిరిగి చూసేటప్పటికి ఫ్రిజ్ తలుపు తీసి టమాటాలన్నీ నేలమీద పోస్తోంది.

"నువ్వేం ఉద్ధరించక్కర్లేదు గానీ ఇదిగో ఈ పాలు తీసుకుని దయ చెయ్యి!"

పాలల్లోకి తొంగిచూసి "బురుగెయ్యలే అమ్మా!" అంది.

ఓ చెంచాడు బ్రూవేసి కలిపిస్తే ఓ ప్లేటులో పెట్టుకుని తీసుకు వెళ్ళి పోయింది.

కూడా కూడా తిరుగుతూ "మనోయజ్ఞం చూద్దామా అయ్యా! టివిలో వచ్చే బిస్కెట్లు తిందామా! సీతాలు మక్కినయ్యేమో కోద్దామా!" అని వెంటబడే బుజ్జి లేకపోతే ఈయనకి తోచదు. కూచున్న చోటే అన్నీ అమర్చిపెట్టే వాళ్ళమ్మ లేకపోతే ఇంట్లో నాకు కుదరదు.

అసలు నేనే వెంకటితో గొడవ పెట్టుకోకుండా ఉండాల్సింది. గొడవ పడ్డా "పోతే పో! నీ పాటి మనుషులు మాకు దొరకరా! డబ్బు పడేస్తే ఎవరన్నా చేస్తారు" అని అనకుండా ఉండాల్సింది. అయినా నేను మాత్రం ఎంతకని ఓర్పుపట్టేదీ? ఇంటా బయటా కూడా ఇరవైనాలుగ్గంటలూ అందరితో మర్యాదగా వ్యవహరించాలంటే ఎవరి వల్లయినా అయ్యే పనేనా! అది ఈ మధ్య ఏ మాటా వినిపించుకోవడం మానేసింగి ఏ పని చెప్పినా "ఇప్పుడా" అనడం. పదిసార్లు పిల్చినా పలక్కపోవడం. ఎక్కడ కాఫీ గ్లాసులక్కడే. తను ఏం పనులు చేయదల్చుకుంటుందో అంతవరకే. ఆపైన అరిచి గీపెట్టినా వినిపించుకోదు. ఒకసారి వంటచేసి బల్లమీద పెట్టేసి దాని గూట్లోకి పోయి తలుపేసుకుందంటే సాక్షాత్తూ దుర్వాస మహాముని సపరివారంగా భోజనానికి వచ్చినా ఇది మాత్రం నా పిలుపుకందదు. మిగిలిన చావు నే చావాల్సిందే! మా పిల్లలు వారంలో పది రోజులు బయట భోజనాలే కాబట్టి సరిపోతోంది మా పెద్దవాళ్ళ కోసం సొరకాయీ, బీరకాయీ మార్చి మార్చి చేస్తే. మరెప్పుడైనా మా వాళ్ళకి హోటల్ భోజనాలు వికారపెట్టో, చేతిలో కాపర్సయిపోయో నాలుగు రోజులు ఇంటి పట్టున ఉంటే ఇంక మొదలవుతాయి దీని పెంకిచేష్టలు. ఎంత కోపం తెప్పించాలో అంతా తెప్పిస్తుంది. దీని పుణ్యమాని మా ఇంట్లో మూడుతరాలవాళ్ళవీ మూడు పార్టీలయ్యాయి. అటు పెద్దవాళ్ళకి సర్ది చెప్తూనూ, ఇటు చిన్న వాళ్ళని గదమాయిస్తూనూ ఇల్లు నిర్వహించవలసి రావడంతో నా పని అసెంబ్లీలో

ముఖ్యమంత్రి గారిలా తయారయింది. స్పీకరు గారిలా మా అయన మాటి మాటికీ 'సైలెన్స్' అని అరవటం తప్ప వేరే ఏవీ చెయ్యరు! చెయ్యలేరు! అందరూ నిశ్శబ్దంగా ఉంటే అంతా సజావుగా సుఖసంతోషాలతో ఉన్నారని ఈయనకో నమ్మకం.

వెంకటి గురించి ఒక్కటి మాత్రం ఒప్పుకోక తప్పదు. కొన్ని కొన్ని పనులు బాగానే చేస్తుంది. అరటికాయ ఆవపెట్టి వండినా, అవియల్ చేసినా నేను చేశానో, అదే చేసిందో తెలుసుకోలేరు ఎవరూ కూడా! నా ట్రైనింగ్ అలాంటిది మరి! ఇంట్లో దాని కళ్ళ ముందరే ఎన్ని వింతలూ, విడ్డూరాలూ జరుగుతున్నా పట్టించుకోదు. పొరపాట్న కూడా నోరిప్పదు. ఓ తిండికిగానీ, డబ్బుకిగానీ, షోకులకి గానీ దేనికీ ఆశపడదు. నిధీ నిక్షేపం అక్కడ పెట్టినా అక్కర్లేదు. చివరకి పదిసార్లు కేకలేస్తేగానీ అన్నం కూడా తినదు. ఇన్ని సుగుణాలున్న పనిమనిషిలో కాసిని పెంకివేషాలుంటే మాత్రం సద్దుకోక చస్తానా! తమ మీద కన్నా నాకు వెంకటి మీదే ప్రేమ ఎక్కువని మా ఇంట్లో పిల్లలకి ఓ అభిప్రాయం కూడా. ఏ ప్రేమలైనా అవసరాన్ని బట్టే కదా! పిల్లల్ని ప్రేమగా చూడకపోతే పలకరించరని భయం. పనివాళ్ళయితే పారిపోతారని భయం.

పనివాళ్ళ మీదుండేది ప్రేమా కాదు, పాడూ కాదు. చేతకానితనం అని వీళ్ళు స్వయంగా సంసారాలు నడుపుకున్నప్పుడు కానీ తెలియదు. అందరిచేతా ఇన్ని మాటలు పడుతూ ఎప్పుడూ దీని పక్షమే మాట్లాడుతున్నప్పటికీ ఒక్కసారి కోపంతో ఏదో అన్నానని వెళ్ళిపోవడానికి సిద్ధమైపోతోంది. అంతలోనే ఉంటాయి మన విశ్వాసాలు. అయిదేళ్ళు చేసింది అయిదు నిమిషాల్లో ఖతం.

ఇది రాకముందు మా ఇంట్లో పని చేసేందుకు లక్ష్మమ్మని చెప్పి ఓ త్రిపాది నక్షత్రం ఉండేది. ఒక నాలుగు గిన్నెలు తోమడం, ఊళ్ళో ఓ రౌండేసి రావడం. నిలకడగా ఒక్కచోట పది నిమిషాలు నిలబడలేని మనిషి నా దగ్గర పదేళ్ళు పని చేసింది. అదున్నన్నాళ్ళూ మా ఇంటికెవరొచ్చారో, వెళ్ళారో, ఏం వండుకున్నామో, ఎంత పారేసుకున్నామో మా వీధిలో కథలు కథలుగా చెప్పుకునే వాళ్ళు. నేను లేనప్పుడు మా ఇంట్లో జరిగే విశేషాలన్నీ ఊరేగి మళ్ళీ నాకే చేరేవి. తరగవే అని కత్తి పీటా కిలో కూరా ముందు పెడితే "అంతెందుకమ్మా! ఊకనే పారబోస్తవ్!" అని సగం మళ్ళీ ఫ్రిజ్‌లో పడేసేది. అది చూసి 'పాపం దీనికెంత జాగ్రత్తో' అని సంబరపడేదాన్ని. దానికి తరగడానికి బద్ధకం అని గ్రహించేందుకు నాకు చాలా కాలం పట్టింది. 'ముసల్దయి పోయిన తల్లి చేత

అంట్లు తోమిస్తున్నార'ని మా పేటలో మహిళలు కోప్పడ్డంతో లక్ష్మమ్మ కొడుకు లొచ్చి దాన్ని పనిమానిపించి వాళ్ళింటికి తీసుకు పోయారు.

చేతనైనంత నమ్మకంగా పనిచేసిన మనిషి వెళ్ళిపోవడంతో మా అవుట్ హౌస్‌లో ఉంటూ ఇంటిపని, వంటపని చేసి పెట్టే మనిషి కోసం వేట మొదలు పెట్టాను. అప్పుడొచ్చింది వెంకటి - వాళ్ళమ్మా నాన్నలతో కలిసి. నల్లగా, సన్నగా, పొడుగ్గా ఉండి ఎవరికేసీ చూడకుండా వెనక్కి తిరిగి చూస్తూ ఏవీ మాట్లాడని పద్దెనిమిదేళ్ళ పిల్ల. నాలుగు నెలల కడుపు. లక్ష్మమ్మ వాగుడుతో విసుగెత్తి పోయున్నానేమో దీని మాట్లాడకపోవడం లక్షణం చాలా నచ్చింది.

"పిల్లకి పెళ్ళెప్పుడు చేశారు! అప్పుడే కడుపేవిటీ!" అని వెంకటి అమ్మా, నాన్నను అడిగితే అప్పుడు చెప్పుకొచ్చింది వాళ్ళమ్మ. 'పిల్లకి పెళ్ళి చెయ్యరా' అని ఊళ్ళో వాళ్ళు పోరుపెడుతుంటే భరించలేక ఒక పిలగాడికిచ్చి పెళ్ళి చేసి అత్తారింటికి అంటే జూబిలీహిల్స్‌లో ఒక కాంప్లెక్స్ కట్టే తాపీ వాడకి పంపి బరువు దింపుకున్నారుట. అక్కడ పిలగాడికి తల్లీదండ్రీ, ఆరుగురన్నదమ్ములు, పదిమంది వదినలు, చానామంది పిందండ్రులు, పిన్నమ్మలు. ఒక నూరు మందున్న కుటుంబమంట. వాళ్ళ జట్టొక్కటే ఏ బ్రిడ్జి పనైనా చెయ్యగలదు. అత్తవారింటి గొప్పలు అటుంచితే ఇది పాపం మూడు నెలలు తాపీ అత్తారింట్లో కాపరం చేసి అత్తగారితో పోటీగా ఇటికెలు మోసేటప్పటికి పీనుగులా తయా రయింది. ఎర్రగడ్డలూ, రేషన్ బియ్యం తిని ఇసికా, సిమెంటు మొయ్యలేక పోయిందని, దాని మొగుడు తాగుతాడనీ, వాళ్ళమ్మ చెప్పినవన్నీ విని దాన్ని కొడతాడనీ ఈ హడావిడిలోనే నెలతప్పిందనీ చెప్పింది. ఈలోగా వాళ్ళ కంట్రా క్టరుకి తెలుగుగంగ పని రావడంతో జట్టంతా వెళ్ళిపోతూ కూడా దీన్ని రమ్మంటే రానని ఏడ్చిందిట. మట్టితట్టలు మొయ్యడం నా వల్ల కాదని కోడలూ, ఎంగిలి కంచాలు కడుగుతావా అని అత్తా చాలా జగడమాడుకున్నార్ట. వీళ్ళు పిల్లని తీసుకుని వచ్చేశారుట. అదీ దీని కాపరం కథ. ఆ లెవల్లో కూడా ప్రొఫెషనల్ ఇన్‌కంపాటిబిలిటీ వల్ల కాపరాలు చెడతాయన్నమాట. ఇందులో ఎవర్నీ తప్పు పట్టడానికి లేదు.

వాళ్ళని చూస్తే చీమతలకాయంత దిగులు కూడా కనబడలా. మనిళ్ళల్లో అయితే ఏదో జరగరానిది జరిగినట్లు మాడుమొహాలేసుకుని తిరుగుతాం.

"మాకు ఇంగ ఎనిమిది మంది బిడ్డలున్నారు. ఈమె ఇష్టం. ఏడనన్నా బతకనీ ఎట్లనన్నా బతకనీ. నీక్కావాల్నంటే పని నేర్పి చేయించుకో! ఆమె పైసలు మాకేం ఇయ్యక్కర్లే!" అని దాన్ని నా దగ్గిర పడేసి పోయారు వెంకటి అమ్మా, నాన్న. ఇంక అప్పట్నించీ అది నాకు పనిచేసిందో, నేనే దానికి చేశానో భగవంతుడికే తెలియాలి. ఎనిమిదో నెల సగం పడ్డాక వాళ్ళమ్మా నాన్నా వచ్చి ఊరు తీసుకుపోయారు పురుడుచేసి పంపిస్తామని. పదిహేను రోజుల పిల్లనెత్తుకు వచ్చింది మళ్ళీ మా ఇంటికి.

తల్లిప్రేమ చాలా గొప్పదని ఎందరి నోటో విన్నాను. ఎన్నోచోట్ల చదివాను. మా అమ్మ ప్రేమని కడుపు నిండా తిని పెరిగాను. ఏదో అటు ఇటుగా నా పిల్లల్ని ప్రేమగానే పెంచాననుకుంటాను. కానీ ఆ ప్రేమనే పదార్థం ఇంత గాఢంగా, ఒత్తుగా, మత్తుగా ఒక మైకం లాగా ఒకప్పుడు తపస్సులాగా ఉంటుం దనేది వాళ్ళిద్దర్నీ చూసేవరకు నేనెరుగను. వెంకటికి పిల్ల తప్ప మరో లోకం తెలియదు. ఎవరితోనూ ఓ మాటాలేదు, పలుకూ లేదు. తనూ తనపిల్లా అంతే. ఆ పిల్ల పీచులాగా ఉండి అస్తమానం ఏడుస్తూ ఉండేది. దాని ఏడుపు వినలేక మా అందరికీ తలనొప్పొచ్చేసేది కాని వాళ్ళమ్మ మాత్రం బిస్మిల్లాఖాన్ షెహ నాయ్ కచేరీ చేస్తున్నట్లు పొంగిపోతూ వింటుండేది. వెంకటికి రెండే పనులు. ఒకటి ఇంట్లో పనులు చేయడం. లేకపోతే పిల్లకి పాలివ్వడం. ఎప్పుడూ దాన్ని చంకనేసుకునే తిరిగేది. మా ఆయనయితే వాళ్ళిద్దర్నీ కలిపే సంబోధించేవారు తల్లిపిల్లా ఎలా ఉన్నారంటూ! తనకి ఓ తిండిగానీ, షోకుగానీ, మొగుడుగానీ, చివరికి సినిమాలూ, టీవీలుగానీ ఏవీ అక్కర్లేదు. తన పిల్ల నవ్వితే పండగ, ఏడ్చినా పండగే!

అలా అలా పిల్లకి నాలుగు నెలలొచ్చాయి. ఓ రోజు పొద్దున్నే ఆ పసి దానితో సహా మా గదిలోకి పరిగెత్తికెళ్ళి నా మంచం కింద ఓ చీరపరిచి దాన్ని పడుకోపెట్టి తలుపువేసి బయటికి రావడం చూసి కసిరాను - "అసలే ఎలకలు పరిగెడుతున్నాయి. పిల్లని మంచం కింద దుమ్మూ దూళీలో పడుకోబెట్టడం ఎందుకు?" అని. నెమ్మదిగా వచ్చి నా చెవిలో చెప్పింది, "చప్పుడు చెయ్యక. బుజ్జిని తీస్కపోనికి ధాని నాయనొచ్చిండు" అని. వాకిట్లోకి వచ్చి చూశాను. ఎర్రగా పొట్టిగా ఉంగరాల జుట్టుతో పాతికేళ్ళ చక్కటి కుర్రాడు. తాగినప్పుడెప్పు డన్నా తెలియక కొడితే మాత్రం వదిలేసి ఎలా వచ్చిందోననిపించింది. ఇదో మూర్ఖపు పీనుగ. ఏ కారణం లేకుండా ఉత్తపుణ్యానికి కొట్టేవాడన్నా నమ్మ

లేనంత అమాయకంగా ఉన్నాడు వాడు. బుజ్జిని వాళ్ళ అమ్మమ్మ తీస్కపోయిం దని చెప్పమని ఇది పోరటంతో అలాగే చెప్పాను. సరేనని వెళ్ళిపోయాడు గానీ నాల్రోజులకోసారి వచ్చి బుజ్జినిచ్చేయమండని పోట్లాడేవాడు.

"మూడునెలల పొట్టతోనున్న మడిసిని ఇడిసిపెట్టి అమ్మ కొంగట్టుకుపోయి నోడికి బిడ్డ కావాల్నా! తలకింత ఆందం పెట్టిండా! నల్లదారం కట్టిండా! పోలీసుల్ని పిలుస్తానని చెప్పు" అని తలుపు వెనకాల దాక్కుని బెదిరించేది. ఎప్పుడూ నోట్లోంచి మాట ఊడిపడని మనిషి మొగుడు కనిపిస్తే భద్రకాళిలాగా లేచేది.

"నువ్వు వాడ్ని కాదనుకుని వచ్చేసినా మీ కోసం చుట్టూ తిరుగుతున్నాడు. సంసారం కాదనుకోవద్దు. నిదానంగా వాడే మారతాడు. వస్తూ పోతూ ఉండ నియ్" అని ఎన్ని విధాలో చెప్పి చూశాను. కానీ ఈ మొండిఘటం నా సలహా వింటేగదా.

"గిట్లనే వచ్చి నన్ను మాయచేసి బుజ్జినెత్తుకపోతాడు. వాని అమ్మ పంపు తుండచ్చు. దీన్నమ్మితే బోల్డు పైసలొస్తయ్యని వాళ్ళ ఆశ. ఎన్నటికీ రానియ్య!" అని ఖచ్చితంగా చెప్పింది.

"మీలో మీకేవన్నా ఉంటే మీ మావతో తేల్చుకో! మా ఇంటికి వచ్చి గొడవ చేస్తే ఊరుకోన"ని కేకలేస్తే వాడూ రావడం మానేశాడు. అయిదారు నెలలు గడిచేటప్పటికి ఇంక వాడి సంగతే మర్చిపోయాను. బోనాల పండగకని పిల్లని తీసుకుని వాళ్ళ ఊరు వెళ్ళేటప్పుడు మూడు వేలు కావాలని అడిగి పట్టికెళ్ళింది. దేనికో లెమ్మనుకున్నా! పది రోజులయ్యాక ఊర్నించి వచ్చి మహాసంతోషంగా నా చేతిలో ఓ కాయితం పెట్టింది. ఏమిటయ్యా అదీ అంటే ఫలానా గ్రామ వాస్తవ్యులైన మ.రా.శ్రీ ............ ఫలానాగారి కుమార్తెకీ ............ ఫలానా గారి కుమారుడికీ జరిగిన వివాహం పెద్దల సమక్షంలో రద్దయిందనీ, వాళ్ళిద్దరూ ఎవర్నయినా పెళ్ళిచేసుకోవచ్చనీ, పిల్ల తల్లి దగ్గిరే పెరిగేందుకు పెద్దలు అంగీక రించారనీ సదరు గ్రామ పెద్దలు రాసి ఇచ్చిన పెళ్ళి చెల్లుచీటీ. భార్యను కాప రానికి తీసికెళ్ళడానికి వాడు సిద్ధపడ్డప్పటికీ ఈవిడగారు వెళ్ళడానికి ఇష్టపడ నందువల్ల రెండు వేల రూపాయలు తప్పుకట్టి, ఊరి పెద్దలందరికీ సారా పోయించి పవిత్ర బంధంలోంచి పర్మనెంటుగా బయటపడి పిల్లనెత్తుకుని రికామీగా మా ఇంటి కొచ్చేసింది. రెక్కల మీద బతగ్గలమనే ధైర్యం ఉండాలే గానీ మనల్ని ఎవరో వచ్చి లిబరేషన్ చేసేదేవిటి? చిన్న పిల్లయినా అలాటి పని

చేసినందుకు అదంటే నాకు చాలా అడ్మిరేషన్. చూస్తుండగానే మా ఇంట్లో మనుషుల్లా అయిపోయారు ఆ తల్లీపిల్లా. నెమ్మది నెమ్మదిగా వంటపని మొత్తం నేర్చుకున్నాను. కాఫీ కూడా సరిగ్గా కలపటం రాని మనిషికి పులుసు కూరల దగ్గిర్నించీ చైనీస్ నూడిల్స్ చేయడం దాకా అవలీలగా వచ్చేసింది. "తేడా వస్తే మొగుడ్నే పొమ్మంది! ఇంక మనం లెఖ్ఖేమిటి?" అనుకుని నేనే అన్ని విషయాల్లోనూ సద్దుకుపోయేదాన్ని. ఎందుకంటే మా ఇంట్లో టిఫిన్లు, భోజనాలు, చుట్టాల రాకపోకలు, కరెంటు వాటరు టెలిఫోను బిల్లులు, కూరలు తేవడాలు, తినగా మిగిలినవి పంచడాలు, బోరింగు రిపేర్లు, ప్లంబింగ్ పనులు ఇలాటి చిన్న చిన్నవన్నీ నేనే చూసుకోవాలి. అవి నేనే చేస్తానో, పనివాళ్ళతో చేయించుకుంటానో, మాన్తానో, చస్తానో! ఎవరికీ చెప్పుకోకూడదు. వాళ్ళకి టైం వేస్టు. విసుగు. మరి అలాటప్పుడు నా స్టాఫ్‌తో సద్దుకుపోవడం కూడా నా డ్యూటీల్లో ఒకటేగా!

రోజులు గడిచినకొద్దీ మాక్కూడా బుజ్జి ఏడుపు షెహనాయ్ వాద్యంలా వినిపించడం మొదలుపెట్టింది. అది ఏడవకపోతే ఏవిటయిందోనని ఆలోచించే వాళ్ళం. మన పెంపకం గదా, మొదటి పుట్టినరోజయ్యేసరికి కాస్త తేలింది. దానదృష్టం. అంతా వాళ్ళ నాన్న పోలిక. కొంపదీసి అందగత్తెవుతుందేమోననిపించేంత ముద్దుగా తయారయింది. చంటిపిల్లల కోసం మొహం వాచున్నానేమో అత్తగారూ, నేనూ మా ఆయనా ఒక్కొక్కళ్ళమే బుజ్జి మాయలో పడిపోయాం. ఇంకో అమ్మ కన్నపిల్ల మీద మమకారాలు పెంచుకోకూడదని తెలుసు. పనివాళ్ళని నెత్తిన పెట్టుకోకూడదని తెలుసు. కళ్ళల్లో వత్తులేసుకుని పెంచిన మన పిల్లలే పెద్దయ్యాక వెలిబుచ్చే అభిప్రాయాలు విని విస్తుపోయే మనం ఈ బంధాలు నిజమనుకుంటామా? అన్నీ తెలుసు. అదే మరి మాయంటే. ఫుల్ కాన్షన్స్‌లో మనం ఉండేది ఇంకొకరి విషయాలూ, సమస్యలూ గురించి ఆలోచించేటప్పుడు మాత్రమే. మనదాకా వచ్చేటప్పటికి దేన్నయినా నచ్చచెప్పుకుంటాం. రైటని నమ్ముతాం. అవసరమైతే వాదించైనా రైటని నమ్మిస్తాం. ఒకళ్ళిద్దరు ఫ్రెండ్స్ 'జాగ్రత్త సుమా దెబ్బ తినేవు?' అని హెచ్చరించి వాళ్ళ బాధ్యతని నిర్వర్తించుకున్నారు.

"మీరయితే కుక్కపిల్లకి సబ్బురుద్ది, నీళ్ళుపోసి పౌడరేసి నోట్లో అన్నం పెట్టి అది మొరిగినప్పుడల్లా ఏవో కబుర్లు చెప్తోందని మురిసిపోతే బాగుందా! సాటి మనిషిపిల్లమీద ప్రేమ చూపించకూడదా. అయినా విశ్వాసంగా ఉంటా

యని ఎవరూ కుక్కల్ని కనరు గదా? మనిషి జాతిలోనే విశ్వాసం అనే లక్షణం పోయింది. వీళ్ళు పెద్దయి ఏదో తవ్వి తలకెత్తుతారని ఎదురు చూడకపోతే ఏ బాధా ఉండదు. ఎప్పటి సంగతులప్పుడే. దేనికదే చెల్లు" అని లెక్చర్లు దంచడం మొదలెట్టేసరికి సలహాదార్లందరూ పక్కకి తప్పుకుని నా ఖర్మానికి నన్ను వది లేశారు. ఆ మాటకొస్తే మనక్కూడా పళ్ళల్లాటి మనవలూ, మనవరాళ్ళూ పుట్టి పెరుగుతున్నా సప్తసముద్రాలు దాటి మాటిమాటికీ మనం వెళ్ళి చూడగలమా! వాళ్ళు వచ్చి మన దగ్గిర వారాల్లెఖ్ఖన కాకుండా మన మనసు తీరేవరకూ ఉండగలరా! వాళ్ళు వస్తారని తెలిసినప్పట్నించీ తిరిగెళ్ళిపోతారు కదాని బెంగే కదా మరి! మన పరిస్థితులిలా ఉన్నప్పుడు ఇంట్లో కళ్ళముందు పసిబిడ్డ మసలుతుంటే ఎన్నాళ్ళు తప్పించుకోగలం!

పెళ్ళిళ్ళకీ పేరంటాలకీ వెళ్ళినప్పుడు బంధుమిత్రులు ప్రేమతో సగౌరవంగా పెట్టే జాకెట్టు బట్టలు బుజ్జికి గౌనులు కుట్టించడంతో మొదలైన వ్యవహారం చివరికి బజార్లో ఏ మంచి గౌను కనబడ్డా వెంటనే తెచ్చే వరకూ తోచని అల వాటుకి దారితీసింది. పాత చెక్కపెట్లో చిన్నప్పుడు మా పిల్లలు ఆడిపడేసిన బొమ్మలన్నీ బయటకి తీయడం అయిపోయాక బజార్లో చైనా బొమ్మలన్నీ ఇంటికి రావడం మొదలెట్టాయి. యథావిధిగా నాలుగు పుట్టిన రోజులూ, కేక్ కట్ చేయడాలూ, భోగిపళ్ళూ అయ్యాక సకాలంలో మంచి బ్రాహ్మణ్ణి పెట్టి (అంటే మా ఆయనన్న మాట) అక్షరాభ్యాసం చేయించి వీధి చివర కాన్వెంటు బళ్ళో పడేసి శక్తివంచన లేకుండా హోంవర్కులు చేస్తూ తొల్చూరు బిడ్డని బళ్ళో వేసి కొత్త తల్లులు పడే హైరానంతా పడ్డాను.

ఒకసారి అది మా ఆయన పెన్ను పట్టుకెళ్ళి ఎక్కడో దాచేసింది. ఎంత వెదికినా కనబడలేదు. "ఏంటి వెతుకుతున్నావ్ అయ్యా! పెన్నా!" అనడిగి రెండు నిమిషాల్లో తెచ్చి ఇచ్చింది. "కాస్త చేతివాటం ఉన్నట్టుంది. పాపం ఎన్ని తిట్లు తింటుందో. ఎలాగో" అని నేనంటే-

"అదే మన పిల్లయితే ఎంత తెలివో? ఎంత బాగా దాచిందోనని మురిసి పోయే దానివి! పనిపిల్ల కూతురవడం వల్ల కదా అలా అంటున్నావ్! చిన్న పిల్లకి బాగుందీ కావాలనే ధ్యాస తప్ప తనదీ, పరాయిదీ అన్న తేడా ఎలా తెలుస్తుంద"ని వెనకేసుకొచ్చారు.

మేం ఇద్దరం ఆఫీసు నుంచి రాగానే "అమ్మొచ్చింది! అయ్యొచ్చిండు" ఎక్కడ దొంగలు అక్కడే అన్నట్లు ఎనౌన్స్ చేస్తుంది. వాళ్ళమ్మ తీసిచ్చిన బత్తాయి

రసం తీసుకొచ్చి జాగ్రత్తగా ఇచ్చి పరిగెత్తికెళ్ళి ఇంకో చిన్న గ్లాసు తెచ్చుకొని ఎదురుగా కుర్చీ జరుపుకుని కూచుంటుంది. ఆయన కాస్త రసం దాని గ్లాసులో పోయగానే త్వరగా అయిపోకుండా ఉండేలా తాగుతూ ఏవేవో విశేషాలు చెప్తూ ఉంటుంది. మా ఆయనతో బాటే భోజనానికి వచ్చి ఆయనకి ఏమేం వడ్డిం చారో అన్నీ తన కంచంలో కూడా వేయించుకుంటుంది. నెయ్యితో సహా అన్నీ వేశారో లేదో చెక్ చేసుకుని టివి ముందు కూచుని భోజనం పూర్తి చేస్తుంది.

అన్నీ బాగానే ఉన్నాయి గానీ ఆలోచించడం ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్న దాని బుల్లి బుర్రలో ఎన్ని సందేహాలో! "అయ్యా అని ఎందుకు పిలవాలె! తాతా అని ఎందుకు పిలవరాదు! మా డాడీ ఏడున్నడు? రోజా నాయమ్మనే వంట చేయల్నా! నువ్వెందుకు చెయ్యవు? నేను టేబిల్ మీదెందుకు తిన కూడదు? నీ దగ్గిరెందుకు పడుకోకూడదు? మా గదిలో ఎసి ఎప్పుడు పెట్టి పిస్తవు?" ఇట్లా. మొదటి రోజు స్కూలునించి రాగానే వాళ్ళమ్మని పట్టుకుని "నువ్వు మమ్మీలెక్క లేవు! ఆయా లెక్కున్నావ్!" అని పెద్ద స్టేట్‌మెంటిచ్చింది. వినడానికి నవ్వుగానే ఉన్నా అది నన్ను ఆలోచనలో పడేసింది. మా తోచుబడి కోసం పెంచుకున్న ప్రేమలు ఈ చిన్నపిల్ల మనసులో లేనిపోని ఆలోచనలకి దారితీయకూడదు కదా! వాళ్ళ డాడీ లేడనీ, ఎక్కడికో పోయాడనీ, వాళ్ళమ్మ నా దగ్గిర వంటపని ఉద్యోగం చేస్తోందనీ, ఆ జీతంతో దాన్ని చదివించి పెద్ద చేస్తుందనీ, దానికి అమ్మమ్మా, తాతా, మావలూ అందరూ ఉన్నారనీ, వాళ్ళమ్మని ఇది పెద్దయ్యాక మంచిగా చూసుకోవాలనీ ఇలా ఒక్కొక్కటే వీలు న్నప్పుడల్లా కూచోపెట్టి చెప్తుంటాను. పసిపిల్లను మభ్యపెట్టి మహా పాపాలు చెయ్యడం లేదని నా మనసుకి నేను సమాధానం చెప్పుకోవాలి కదా మరి! నేనెంత తాపత్రయ పడుతున్నా "మీరింత లాడు చేయకుండ్రి, నాకు చేతరాదు దీన్ని సాకడం" అని అప్పుడప్పుడు వాళ్ళమ్మ తన పొజిషనూ, పవరూ చూపిస్తూనే ఉంటుంది.

వాళ్ళమ్మతో కూరలకొట్టుకెళ్ళి కూరలు తెచ్చాక అన్నీ విడగొట్టి దేనికవి కవర్లలో సర్దడం నేర్చుకుంది. ఆకుకూరలమ్మిని నిలబెట్టడం, అరటి పళ్ళ బండిని పిల్చుకురావడం, ఫోను మోగ్గానే ఎత్తేసి అమ్మలేదని చెప్పేయడం, సీసాల్లో నీళ్ళు నింపి ఫ్రిజ్జ్‌లో పెట్టడం, ఒకటేవిటి! ఇలాటి పిల్లల్ని చూసే "కుంచవంత కూతురుంటే మంచం మీదే అన్నీ!" అని పెద్దవాళ్ళన్నారేమో అని పించేంత చురుకు. వాళ్ళమ్మకి నీడే!

ఏమో! రోజులెప్పటికీ ఇలాగే జరిగిపోతాయి! ఈ బుజ్జి నేను చెప్పినట్లుగా చదువుకుని సినిమాల్లో హీరోయిన్లా పెద్ద ఆఫీసరయిపోతుందని ఏవేవో ఊహించుకునే దాన్ని పనీపాటా లేకుండా! చివరికి ఏవయిందీ? నా ఫ్రెండ్సే సైటని తేలింది కదా మరి! చేసిందంతా చంక నాకిపోయింది. 'పోతేపో' అని ఒక్క మాటన్నానని వెళ్ళిపోడానికి రెడీ అయిపోయింది కదా! పిల్ల సంగతి ఏమవుతుందోనని ఆలోచనన్నా ఉందా ఆ మొహానికి! వాళ్ళకేం చదువులూ, ఉద్యోగాలూ అఖ్ఖర్లేదుట. మర్యాదుంటే చాలుట. ఏ వాటమూ లేకుండా అది మాత్రం ఎందుకో మరి. మనకయితే చదువుకోకపోతే అడుక్కు తినాల్సొస్తుం దేమోనని ఎప్పుడూ భయమే. చేతిలో పనున్న వాళ్ళకేం భయం! కన్నపిల్లలయితే ఓ మాట అనుకున్నా, ఆడుకున్నా, తిట్టుకున్నా, తిమ్ముకున్నా తెల్లారితే అన్నీ హుష్ కాకీ! ఎన్ని విధాలగానో కనిపెట్టుండి, ఎన్నెన్నో సర్దుకుని ఎంత చేసినా బయటవాళ్ళతో కాస్త మాట తేడా వస్తే మరింతే కదా సంగతులు! పెడితే తింటాంగానీ తిడితే పడతామా అన్నట్లుంటారు.

"ఒక్క మాటన్నానని చెప్పి పెద్దంతరం, చిన్నంతరం లేకుండా మూడు రోజుల్నించి ముసుగుతన్ని ఎవరు పిలిచినా పలక్కుండా పడుకునుంది. పైపెచ్చు అత్తయ్యగారి చేతే వాళ్ళ నాన్నకి ఫోన్ చేయించిందట వచ్చి తీసుకు పొమ్మని. ఆయనొచ్చి లెఖ్ఖ చూసుకుని తీసుకుపోతాడుట. ఇదీ ఒకందుకు మంచిదేలే! రాత్రి తొమ్మిదింటి వరకూ హోంవర్క్ చేసే పని తప్పింది. నా వంట మహత్యం. ఒక్క కూర కూడా ఫ్రిజ్జ్‌పై అరలోకి చేరడంలేదు. ఇద్దరత్తలం, ఇద్దరు కోడళ్ళం వెరసి ముగ్గురం కలిసి పోటాపోటీలుగా ఇంటెడు పనీ ఆడుతూ పాడుతూ టైంకన్నా ముందుగానే చేసుకుంటున్నాం. మా ఎదురింటి వాళ్ళ పనిమనిషి వచ్చి ఆలస్యంగానైనా పైపనులు చేస్తూనే ఉంది. ఎమర్జెన్సీ టయంలో దేశంలో ఉండే ఐకమత్యం లాంటిది మా ఇంట్లో వెల్లివిరుస్తోంది. ఇలా ఎన్నాళ్ళు జరుగుతుందో తెలియదుగానీ ప్రస్తుతానికైతే పెద్ద ప్రోబ్లెం ఏం అనిపించడం లేదు. ఇంక బుజ్జి సంగతంటారా! కొన్నాళ్ళుపోతే అదీ అలవాటవు తుంది మరి.

తెల్లవారిందిగానీ ఇంకా నేను నిద్దరలేచే టైం అవలేదు. అటూ, ఇటూ దొర్లుతూ ఆవేల్టి వర్క్ ప్లాన్ చేసుకుంటుంటే బుజ్జి అరుపులు వినబడ్డాయి. ఏవిటోనని పెరట్లోకి పరిగెత్తాను. అక్కడ కొత్త పనిమనిషి నిలబడి నవ్వుతోంది. దాని నెత్తి మీంచి నీళ్ళు కారుతున్నాయి. బుజ్జి "నాయమ్మకి జరం. నే తోమతా

బాసన్లు! నువ్వు ఫో! నీళ్ళు పోసేస్తా!" అని అరుస్తూ ఓ కంచం కుళాయి కింద పెట్టి కడిగేస్తోంది. ఒక్క దెబ్బతో నా నిద్దరంతా ఎగిరిపోయింది. కడుపులో తిప్పేసినట్లయింది. మా ఇంట్లోంచి వెళ్ళిపోయాక దీన్ని కూడా ఎవరింట్లోనైనా పనికి పెట్టేస్తారా? ఆ ఆలోచనే భరించలేకపోయాను. నన్ను చూడగానే బుజ్జి వెళ్ళిపోయింది దాని గదిలోకి. వాళ్ళమ్మ నాతో మాట్లాడొద్దంది కాబోలు. ఇంతలోకీ కౌసల్య వచ్చింది బట్టల మూటెత్తుకుని.

"పోతరంటగదమ్మా" అనడిగింది.

"అవును. నాతో పడలేకపోతోందిట. మనిషి బతకడానికి ఇన్ని కూరలూ, పెరుగులూ అక్కర్లేదుట. వాళ్ళ ఊరు వెళ్ళిపోయి వాళ్ళమ్మ దగ్గర హాయిగా, మరేదగా బతుకుతారట".

"ఎన్ని దినాలమ్మ హాయి! అళ్ళమ్మ కూసోబెట్టి మేపతాదామ్మ తల్లినీ బిడ్డనీ!"

"ఏమో మరి! ఆ విషయాలు మీకే తెలియాలి. ఈపాటి చేసేవాళ్ళు దొరకరా నాకు. పని అలవాటైన మనిషి. నాకా అస్తమానం టూర్లు. పిల్ల చేరి కైందిగదాని అన్నీ చూసీ చూడనట్లు ఊరుకుంటుంటే చేతకాని దానిలాగా కనిపిస్తున్నాను దీనికి."

"నేను రోజూ చెప్తున్నానమ్మ. వాళ్ళ నాయనొస్తడంట గదమ్మ. ఏం చేస్తడో మరి" అనుకుంటూ మూట తీసుకుని వెళ్ళిపోయింది.

ఇంట్లో పనితో నేను సతమతమవుతుంటే కాలక్షేపంకాక ఈయనకి చిరాకెక్కువైపోయింది. బుజ్జి ఏ కిటికీలోంచో అయ్యా అని పిలవడం, పారిపోవడం. దాని ఆట దానిదీ. పైపెచ్చు అన్నం తీసికెళ్ళడానికి కూడా లోపలికి రావటం లేదు. "నా యమ్మ గుమ్మం దాటి లోపలికి పోవద్దన్నద"ని చెప్పి కంచం బయటనించే తీసుకుపోతోంది. వాళ్ళకి బుద్ధిలేదు కదాని మనం పిల్లకి అన్నం పెట్టకుండా మాద్చలేం కదా! ఆ వెంకటి మాత్రం ముసుగుతీయకుండా పడుకుని వాళ్ళ నాయనెప్పుడొస్తాడా అని ఎదురు చూస్తోంది.

"ఒక్కసారి ఇల్లు దాటి బయటికి పోయిందంటే కాళ్ళావేళ్ళా పడినా మళ్ళీ రానిచ్చేది లేదు. క్రితం జన్మలో ఇది దయ్యం అయి ఉంటుంది. ఎవరన్నా నాలుగు రోజులు ముసుగు తీయకుండా పడుకోగలరా?" అన్నా.

"ఇది వరకూ మనిషే!" అని మా అయన నవ్వటం మొదలెట్టారు. అసలే చిరాకులో ఉన్నానేమో అదో మహా కుళ్ళు జోకులా అనిపించింది. "ఇట్స్ ఒకే

అమ్మా!" అని మావాడు వాడి నవ్వుతో పుండు మీద కారం జల్లాడు. పాపం సిట్యుయేషన్ సరిదిద్దాలని అత్తయ్యగారు తాపత్రయపడ్డారు.

"నువ్వింట్లో ఉన్నంతసేపే ఆ వేషాలు! నువ్వటు వెళ్ళగానే తెయ్యిమని లేచి కూచుంటుంది. అదేం పడుకోటల్లా. మాలీ, కౌసల్యా, పద్మా అందరితో కూచుని పంచాయతీ పెడుతోంది. నిన్న ఊరందరూ కూచుని దానితో 'నీ బతుకిట్లా అయింది. బిడ్డ సంగతి చూసుకో! పువ్వు లెక్క పెరుగుతున్నది. ఇట్ల ఎక్కడ జరుగుతుంది! మీ అమ్మ నాయన ఏమనకుండనే పెద్దయినవా? మనమ్మే కద! రెండు తిడితే ఏమయింది!' అని చెప్పిచెప్పి పోయారు. ఈ మొండిఘటం ఉలుకూ, పలుకూ లేదు.

నీ కారు చప్పుడవగానే ఈ మహారాణి హంసతూలికాతల్పం ఎక్కింది.

దాని దగ్గిర మూడు వందలు తీసుకున్నాడుట మాలి. పొద్దున్నే వచ్చి ఇచ్చేస్తానన్నాడు. తాను రాకపోతే నిన్నిమ్మ న్నాడు" అని వివరంగా చెప్పారు.

మళ్ళీ తెల్లారింది. వంటింట్లోకి వచ్చి పెరటి తలుపులు తీశా. బుజ్జి గుమ్మం లోకి వచ్చి అడిగింది. "అమ్మా! నా యమ్మ వంట చేయ్యాల్నా!"

"ఏం అవసరం లేదు! మీ అమ్మకేం నోరుపడిపోయిందా? నిన్ను రాయ బారం పంపింది?"

"పోనీ నే వంట చేయాల్నా!"

"చెయ్యి! అందరం పోయి జైల్లో కూచుంటాం నీ చేత పని చేయించి నందుకు!"

"అమ్మకేం చెప్పాల్నమ్మా!"

"ఏడవమను?"

"రేపు రాత్రి తాన ఏడిసింది! రమ్మనాల్నా!"

"ఈ సొరకాయలేవిటి? ఎక్కడివి?"

"నా తాత తెచ్చిండు. ఒన్, టూ, త్రీ, ఫోర్, ఫైవ్ తెచ్చిండు. ఒన్ హండ్రెడ్ త్రీ దొండకాయలు కూడా తెచ్చిండు. రమ్మనాల్నా!"

"నేపోయాక రమ్మను!"

"అమ్మ రమ్మన్నది! ఆమె పోయినంక రమ్మన్నది" గెంతుకుంటూ వెళ్ళి పోయింది.

సాయంత్రం ఇంటికి వచ్చేటప్పటికి నేల మెరిసిపోతోంది. డైనింగ్ టేబిలు మీద చుట్టాలొచ్చేటప్పుడు వేసే అమెరికా క్లాతూ! మరచెంబులో మందార పూలూ, వంటిల్లంతా కడిగి ముగ్గులు పెట్టబట్టి కణ్వాశ్రమంలా కళకళ్ళాడి పోతోంది. ఫ్రిజ్జ్ తలుపు తీస్తే రెండు గాజు గ్లాసుల్లో బత్తాయిరసం, గట్టుమీద జంతికల డబ్బా!

'అంతా బాగానే ఉందిగానీ తల్లీపిల్లా కనబడరేవిటి చెప్మా! మొహం చెల్లక ఏ కూరలు తెచ్చేందుకో పోయింటారులే!

**24-11-2002, ఆదివారం ఆంధ్రజ్యోతి**

✦ ✦ ✦